నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పిం చవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

- డిఎస్‌సి ఉచిత శిక్షణ ముగింపు సభలో యుటిఎఫ్ నాయకులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ఈ నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించే డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టులు సాధించాలంటే మరింత కష్టపడాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్ పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో 40 రోజులపాటు డిఎస్‌సి ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి డిఎస్‌సి అభ్యర్థులకు ఎస్‌జిటిలో ఉచిత శిక్షణను యుటిఎఫ్ ఇచ్చిందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకుండా చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయని హెచ్చరించారు. విద్యను అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేదని తెలిపారు. కారణాలు ఏమైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం డిఎస్సీ నిర్వహిస్తూ ఉందని చెప్పారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవడం కోసం, నవతరంలో చైతన్య స్ఫూర్తిని నింపేందుకు యుటిఎఫ్ ఈ ఉచిత కోచింగ్ నిర్వహించిందని పేర్కొన్నారు. వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇచ్చే నిష్ణాతులైన ఫ్యాకల్టీతో ఇక్కడ ఉచిత శిక్షణ ఇప్పించామని తెలిపారు. సహకరించిన వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని తాము కోరుకుంటున్నామన్నారు. మీరంతా ఉపాధ్యాయులు అయ్యాక యుటిఎఫ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని, రాకపోయినా నిరుత్సాహ పడవద్దని చెప్పారు. ఉద్యోగం సాధించేవరకు నిరంతర కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంతోమంది ప్రయివేట్ విద్యా సంస్థలు నెల కొల్పి కోట్ల రూపాయలు ఆర్జించిన వారు ఉన్నారని పేర్కొన్నారు. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు. ఉచిత కోచింగ్‌కు ఆధ్యుడైన ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. డిఎస్‌సి పరీక్ష రాసేటప్పుడు ఎలాంటి తడ పాటు పడవద్దని చెప్పారు. జిల్లాలో అనుకున్న స్థాయిలో కోచింగ్ సెంటర్లు లేవని, దీనిని దృష్టిలో పెట్టుకుని యుటిఎఫ్ ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. భవిష్యత్తు ఉపాధ్యాయులను యుటిఎఫ్ తయారు చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సమిష్టి కృషితో 40 రోజులపాటు నిర్వహించిన శిక్షణ విజయవంతమైందని తెలిపారు. మరింత కష్టపడితే మీ శ్రమ వృధా కాదని చెప్పారు. యుటిఎఫ్ సహా అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి యజాజ్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ సాధ్యమవుతుందా అన్న సందేహంతో ముందడుగు వేశామని పేర్కొన్నారు. చివరికి అభ్యర్థులకు తమ శక్తి మేర శిక్షణ ఇచ్చినట్లు తాము భావిస్తున్నామని తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే వరకు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నరసింహారావు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులాచారి, అభయ్, అనిల్ కుమార్, నరసింహులు, ప్రకాష్, బాష, గౌస్ పీర్, శిక్షణ తీసుకున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

యోగాతో ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం : కలెక్టర్

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ శ్రీధర్, నగర ప్రజలు

ప్రజాశక్తి-కడప అర్బన్

మన దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే ఇంటిల్లిపాదికీ యోగానందం, ఆరోగ్య భాగ్యం సొంతం అవుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎసిఎ క్రికెట్ స్టేడియంలో నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫ్యామిలీ యోగా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్యామిలీ యోగా కార్యక్రమానికి ఒక్కో కుటుంబానికి చెందిన పిల్లలు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ మొదలైన మూడు కెరగిరీలకు చెందిన 4,365 మంది హాజరై యోగాసనాలు వేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, డిఆర్‌డిఎ పీడీ రాజలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, డిఎస్‌డిఒ జగన్నాథరెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ మురళి తదితర జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, పలువురు ఉద్యోగులు, ఎన్‌జిఒ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్‌సి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ సమస్యను పరిష్కరించాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం డిఎస్‌సి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, శివకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మే 30వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోమని ప్రభుత్వం చెబుతూ ఉందని తెలిపారు. రకరకాల సమస్యల వల్ల 31వ తేదీ ఉదయం నుంచి డౌన్‌లోడ్ కావడం లేదని పేర్కొన్నారు. అభ్యర్థులకు హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం సవరించి అప్లై చేసుకున్న అందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. రెండు, మూడు సబ్జెక్టులు అప్లై చేసుకున్నవారికి ఒకటే హాల్ టికెట్ వస్తుందని తెలిపారు. సర్వర్ యు హావ్ మే నాట్ సెలెక్ట్ ఎనీ పోస్ట్ అని చాలామందికి చూపిస్తుందని పేర్కొన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అప్లై చేసుకున్న వారికి ఒక పోస్టుకు మాత్రమే తేదీ సమయం చూపిస్తుందని తెలిపారు. మిగిలిన పోస్టులకు హాల్ టికెట్లో ఎప్పుడు పరీక్ష ఉంటుంది, సెంటరు, సమయం వివరాలు రావటం లేదని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ అన్నీ పరీక్షలకు హాల్ టికెట్లు ప్రభుత్వము అందుబాటులో పెట్టాలని తెలిపారు.

బలవంతపు బదిలీలను ఆపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : బదిలీల పేరుతో ఉపాధ్యాయులను బలవంతంగా క్యాడర్ మారుస్తూ బదిలీ చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం డిఇఒ షేక్ శంషుద్దీన్‌ను కలిసి అసంబద్ధ బదిలీలు ఆపాలంటూ ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల విషయంలో రాష్ట్ర విద్యా శాఖకు ఏ ఒక్క విషయంలోనూ స్పష్టత లేదని పేర్కొన్నారు. బదిలీల చట్టాన్ని చట్టు బండలు చేసిందని పేర్కొన్నారు. బదిలీల విషయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం వివాదాస్పదంగా ఉన్నదని, అవగాహన రాహిత్యంతో ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడమే లక్ష్యంగా, గత ప్రభుత్వ విధానాలను అనుసరిస్తూ ముందుకు వెళుతున్నట్లుగా ఉందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అసంబద్ధ బదిలీలను ఆపి అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా పెంచలయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కడప సిటీ : జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ (ఎఫ్‌ఎసి) బాధ్యతలను ఆదివారం డెర్మటాలజీ హెచ్‌ఒడి డాక్టర్ పెంచలయ్య స్వీకరించారు. రిటైర్డు సూపరింటెండెంట్ జి.వి.రమాదేవి శనివారం రిటైరైన సంగతి తెలిసిందే. సీనియర్ వైద్యులను సూపరింటెండెంట్‌గా నియమించాల్సి ఉంది. ఆమె పెంచలయ్యకు బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్ పాలనా బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తించడానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రతిరోజూ వార్డులను, వైద్య విభాగాలను రౌండ్ల వారీగా పరిశీలిస్తానని తెలిపారు. జిజిహెచ్ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వేగంగా నిర్ణయాలు తీసుకుంటానని తెలిపారు. సహచర వైద్యుల సహకారంతో మెరుగైన సేవలు అందించడానికి ప్రయత్నం చేస్తానన్నారు.

పెంచలయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రమాదేవి

పనిచేయని సర్వర్...ఇబ్బందుల్లో ప్రజలు

పడిగపులు కాస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ చౌకదుకాణ ప్రజా పంపిణీ పథకం కింద బియ్యం, చక్కెర రేషన్ షాప్ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఆదివారం అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిసేపటికి సర్వర్ పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి 15 నుంచి 20 నిమిషాల పాటు తంబ్ వేసేందుకు సమయం తీసుకుంది. ఒక్కసారి తంబ్ వేస్తే బియ్యము, చక్కర తీసుకునే అవకాశం ఉంది. సర్వర్ పనిచేయని కారణంగా బియ్యా నికి, చక్కెరకు రెండుసార్లు తంబ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదటిరోజు కావడంతో సర్వర్లో ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. 15వ తేదీ వరకు రేషన్ తీసుకునే అవకాశం ఉండడం వల్ల అనేకమంది లబ్ధిదా రులు చౌక దుకాణం వద్దకు వచ్చి వెన్ను తిరిగి వెళ్ళిపోయారు. చాలామంది రేషన్ దుకాణాల ద్వారా బియ్యం చక్కర ఇస్తేనే మంచిదనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

మల్బరీ సాగుకు పెద్దపీట

- జిల్లా పట్టు పరిశ్రమ శాఖ ఎడి శ్రీనివాసులరెడ్డి

ముఖాముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మల్బరీ సాగుకు పెద్దపీట వేశాం. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సహకారంతో క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించడం ద్వారా మల్బరీ సాగుదారులను ఎంపిక చేస్తాం. వివిఎస్‌పల్లి మండలంలోని కీర్తిపల్లిని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేయడమైంది. జూన్ మాసంలోని తొలకరి జల్లులతో మల్బరీ సాగు ఊపందుకుంటుంది. సమర్థ యాజమాన్య పద్ధతులను జోడిస్తే మంచి ఆదాయం లభిస్తుంది. నూతన రకపు వంగడాలతో మల్బరీని సాగు చేసుకోవాలి. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా మంచి ఆదాయం లభిస్తోంది. సరుకును తూకం వేసిన వెంటనే పేమెంట్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది. స్వల్పకాలిక పంటల తరహాలో 45 రోజు నుంచి 70 రోజుల వ్యవధిలో ఆదాయం లభిస్తోంది. తెగుళ్ల సోకే అవకాశం ఉండదు. వాణిజ్య పంటల తరహాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమలశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

మల్బరీ వివరాలు తెలపండి?

జిల్లాలో 500 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సర ఆగస్టు నాటికి 200 ఎకరాల లక్ష్యాన్ని చేరుకోవాలి. జూన్ మాసంలో కురిసే తొలకరి ఆధారంగా మల్బరీ సాగును ప్రోత్సహించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 400 నుంచి 500 మంది రైతులకు రూ.300 కోట్ల మేరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

మల్బరీ ఫామ్‌లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరు ప్రాంతాల్లో పెంచుతున్నాం. రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

జిల్లాలో క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తాం. ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (సిఎన్‌ఎఫ్) అధికారుల సహకారంతో మల్బరీ సాగు రైతులను గుర్తించడం జరుగుతుంది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం క్లస్టర్ గ్రామాల ద్వారా మల్బరీ సాగు లక్ష్యాన్ని అందు కుంటాం. క్లస్టర్ గ్రామాల ఎంపిక చేయడం ద్వారా రైతులకు వనరుల లభ్యత, పెట్టుబడి, రాబడి పెరుగుతుంది. వివిఎస్‌పల్లి మండలంలోని కీర్తిపల్లిని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేస్తామని తెలిపారు. వనిపెంటలో జాకీ పురుగుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అభ్యుదయ రైతులను ఆకర్షిస్తున్నాం. ఫలితంగా మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

ప్రోత్సాహకాల వివరాలు తెలపండి?

ఎకరా నారు మొక్కలకు రూ.30 వేల యూనిట్, షెడ్డు నిర్మాణానికి రూ.3.35 లక్షలు, ఎస్‌సి, ఎస్‌టిలకు నాలుగు లక్షలు కేటాయి స్తున్నాం. పరికరాలు, స్టాండు, ప్లాస్టిక్ తట్టలు, నేత్రికములు (చంద్రికలు) నిమిత్తం రూ.75,000 మంజూరవుతుంది. ఇందులో ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందజేస్తాం.

గూళ్ల రకాలెన్ని, ఇన్‌సెంటివ్స్ వివరాలు?

బైఓల్టేన్, సిబి రకాలు. తెల్లగూళ్లు, ఏప్రిల్, మే, జూన్‌లో సాగు చేసు కోవచ్చు. సిపి గూళ్లు. తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ.750, సిపి గూళ్లకు రూ.50 ఇన్‌సెంటివ్ కింద ఇచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. గూళ్ల కొనుగోలు అనంతరం నగదును చెక్కుల రూపంలో అందజేస్తారు.

మార్కెట్ల వివరాలు తెలపండి?

మదనపల్లి, కుప్పం, కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కె ట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటకలో రాంనగర్, సిద్దల గట్ట మార్కెట్లు అందు బాటులో ఉన్నాయి.

సాగు సీజన్ల గురించి చెప్పండి?

జూన్ నుంచి మార్చి వరకు మల్బరీని సాగు చేసుకోవచ్చు. సిబి రకం, బైవోల్ట్ రకం. సిబి రకం వేడి వాతావరణంలో సాగు చేసుకోవచ్చు. బైవోల్ట్ రకం వేసవిలో సాగు చేసుకోవాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బైవోల్ట్ సీడ్, మార్చి నుంచి జూన్ వరకు సిబి రకం రకాలను సాగు చేసుకోవాలి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. ఐదవ రోజు మార్కెట్‌కు పోతుంది. ఐదో రోజు మార్కె ట్ తీసుకెళ్లి ఇ-యా క్షన్ ద్వారా రీలర్స్‌కు విక్రయించాలి. రేటు ఇష్టం లేక పోతే సెకెండ్, థర్డ్ యాక్షన్స్ కు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా?

ఊరు బయట, పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో షెడ్లు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4.50 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్‌సి, ఎస్‌టి 90 శాతం సబ్సిడీ ఇస్తారు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ పరి చి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీ కట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్టడంతో క్రిమి కీటకాదులు నశించి పోవ డంతో తెగులు అనేది ఉండదు. ఫలితంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్‌గా ఉంటుంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్ల మేపవచ్చు. కోతకు రూ.90 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్

మాట్లాడుతున్న గుంజి దయాకర్

ప్రజాశక్తి-బద్వేలు

వడ్డెరుల కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆ సంఘ ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో డేరంగుల వెంకటేష్ అధ్యక్షతన బద్వేల్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ జూన్ చివరి వారంలో నెల్లూరు నగరంలో జరుగు ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర వృత్తిదారులు, వడ్డెరలు అందరూ ఐక్యంగా, ఒకే మాట, ఒకే తాటిపై ఉండి సమస్యలపై పనిచేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సంఘాన్ని బద్వేల్ టౌన్‌లోనూ నియోజకవర్గంలోనూ జిల్లాలో బలోపేతం చేయాలని కోరినారు. వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించి కార్పొరేషన్ విధి విధానాల ప్రకటించి కార్పొరేషన్ ద్వారా వడ్డెర్లకు 90 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను అందించి వృత్తిదారుల సంక్షేమానికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వడ్డెర మహిళలపై చిన్నారులపై వడ్డెర్లపై వృత్తిదారులపై భూస్వాములు పెత్తందార్లు, అల్లరి మూక అత్యాచారాలు, అగత్యాలు, దౌర్జన్యాలు హత్యలు చేస్తున్నారని వీటిని అరికట్టడానికి ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా అట్రాసిటీ ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొని వచ్చి వడ్డెర్లకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రభుత్వాలను డిమాండ్ చేసినారు. తెలుగుదేశం ఎన్నికల సభలలో వడ్డెర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రినారా లోకేష్ ఎన్నికల సభలలో మాట్లాడుతూ వడ్డెరులు నిత్యం శ్రమజీవులని వారి శ్రమ సమాజానికి ఎంతో ఉపయోగపడిందని కూటమి అధికారంలోకి వస్తే కొండలపై గుట్టలపై క్వారీలపై మైనింగ్ గనులపై వడ్డెర్లకు హక్కు కల్పిస్తామని మాయ మాటలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్డెర్ల ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వడ్డెరల, వడ్డెర వృత్తిదారుల సమస్యలను పట్టించుకోకుండా వారి సమస్యలను గాలికి వదిలేసారని విమర్శించారు. వెంటనే స్పందించి వడ్డెర్ల సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాబోయే రోజుల్లో తగు బుద్ధి చెప్తారని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా బత్తుల గంగయ్య, కో-కన్వీనర్లుగా టి.సుబ్బయ్య, దేవల్ల వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా జి.సుబ్బమ్మ, జి.సుబ్బరాయుడు, విరగదండ్ల రమణ పాల్గొన్నారు.

నెల్లూరు, కడప జట్ల ఘన విజయం

తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నీలో ఆదివారం కడప జరిగిన మ్యాచుల్లో నెల్లూరు, కడప జట్లు ఘన విజయం సాధించాయి. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభ రోజు అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 49.0 ఓవర్లలో 230 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కె.హెచ్.వీరారెడ్డి 47, పి.వికాస్ 42 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎన్.భార్గవ్ 4, ఎస్.అఖిల్ సాలుంకే 3, ఎన్.మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 231 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని జి.మన్విత్ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి సెంచరీ చేశారు. 77 బంతులను ఎదుర్కొని 8 బావుండారీలు, 8 బౌండరీ సిక్సుల సహాయంతో 109 పరుగులు చేశాడు. ఎస్.ఆతిక్ సల్మాన్ 33 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని జి.మల్లికార్జున 2, ఎం.దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన ప్రారంభమైన మ్యాచ్‌లో కడప జట్టు 21 పరుగుల తేడాతో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 45.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం.వాసుదేవరాజు 99, సి.విజయ్ రామ్‌రెడ్డి 61 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి.సబ్జాన్ భాష అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. సూర్య తేజరెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 237 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కర్నూలు జట్టు 45.0 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని టి.తౌఫిక్ హుస్సేన్ 41, మనోజ్ రాజు 66 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీసుకున్నాడు.

మన్విత్‌రెడ్డి (109 పరుగులు)

వాసుదేవరాజు (99 పరుగులు)

సాబ్జాన్‌బాషా (5 వికెట్లు)

ఆదిల్ (4 వికెట్లు)

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి - కడప

క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తేవాలని న్యూ క్రీసెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ జిలానిబాష అన్నారు. కడప నగరం బిల్డప్ ఈద్గా వద్ద సిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లానిబాష క్రీడాకారులను పరిచయం చేసుకొని ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున ఈ టోర్నమెంట్‌కు జట్లు వచ్చి ఆడటం మంచి శుభ పరిణామని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, నేటి ఓటమి రేపటి గెలుపుకు పునాది అవుతుందని పేర్కొన్నారు. క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారని, రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా తయారు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కడప జిల్లాలో కూడా క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి ఎంతో క ృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. క్రీడల్లో యువత ముందుంటే ఉద్యోగాలు తనంతగా తానే తమ దగ్గరికి వస్తాయని చదువుతోపాటు క్రీడలను కూడా సమన్వయం చేసుకొని ముందుకు సాగితే యువత మంచి స్థాయిలో చేరుకుంటుందని తెలిపారు. అనంతరం మొదటి, రెండవ స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి జట్టు సభ్యులకు ప్రశంస పత్రాలు ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నగర అధ్యక్షుడు ఖాజా పీర్, టిడిపి ఎన్నారై కువైట్ నాయకుడు రహమతుల్ల, జాకీర్ మాసాపేట శివ, మదర్ ల్యాండ్ స్కూల్ కరస్పాండెంట్ సాజిద్ బాషా, కెకెఆర్ ప్రతినిధి తాహిర్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందజేసిన జిలానిబాషా

లబ్ధిదారుడితో డీలర్‌కు రేషన్ డబ్బులను ఇప్పిస్తున్న భూపేష్‌రెడ్డి

ఇక నుంచి రేషన్ పంపిణీ 15 రోజులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఇక నుంచి రేషన్ షాపులు 15 రోజులు లబ్ధిదారులకు రేషన్ అందిస్తాయని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని తేరు రోడ్డు, జమ్మలమడుగు మండల పరిధిలోని మోరగుడి గ్రామం ఆర్‌డిఒ ఆదిమూలం సాయి శ్రీ, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డితో కలిసి భూపేష్‌రెడ్డి ప్రభుత్వ చౌక దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ మంచి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మంచే జరుగుతుందన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వం చేసిన పొరపాటును సరిదిద్దుకుంటూ ముందుకు పోతున్నారన్నారు. అందుకు ముఖ్యమంత్రికి భూపేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోరగుడి రేషన్ డీలర్ విశ్వనాథరెడ్డి, తేరు రోడ్డులో జికె గైబూ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలో అన్ని రేషన్ షాపుల ద్వారా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని డీలర్లు ప్రారంభించారు. రెవెన్యూ సిబ్బంది పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎండియు ఆపరేటర్లు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇప్పటివరకు ఇదే విధానాన్ని కొనసాగించారు. ప్రస్తుతం రేషన్ పంపిణీని షాపుల వద్దనే డీలర్ల సమక్షంలో పంపిణీకి శ్రీకారం చుట్టారు. చాపాడు మండల పరిధిలో 32 రేషన్ షాపులకు సంబంధించి 12,737 రేషన్ కార్డులు అందుబాటులో ఉన్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు రేషన్ షాపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వృద్ధులు, విభిన్నప్రతిభావంతుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

వేంపల్లె : కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా డీలర్లు రేషన్ బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయాలని మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె మెయిన్ బజార్‌లో వారు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, డీలరు సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య, నాగిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మేదర రవికుమార్, రామాంజనేయులు, రామస్వామి, రమణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌పై విమర్శలు సరికాదు

ప్రజాశక్తి - చాపాడు

మంత్రి లోకేష్‌పై వైసిపి నాయకుల విమర్శలు సరికాదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పదో తరగతి జవాబు పత్రాల రికౌంటింగ్ విషయంలో విద్య శాఖామంత్రి నారా లోకేష్‌పై మాట్లాడడం సరికాదన్నారు. కడప జిల్లాలో మహానాడు 43ఏళ్ల చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో విజయ వంతమైందన్నారు. దీన్ని జీర్ణించుకోలేక లోకేష్‌పై విమర్శించడం సరికాదన్నారు.

14 ఏళ్ల తర్వాత ఆరవేటిపల్లెలో జాతర

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆరవేటిపల్లెలో 14 ఏళ్ల తర్వాత పెద్దమ్మ తల్లి జాతర గ్రామ పెద్దలు, ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, వైసిపి నాయకులు రామసుబ్బారెడ్డి, సర్పంచ్ కత్తెమ్ పెద్దక్క, ప్రజా ప్రతినిధులు, పలువురు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎపి హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్‌ఆర్బి, గ్రూప్ డి, ఎన్‌టిపిసి ఉద్యోగాలకు ఉచిత కోచింగ్‌ను సోమవారం నుంచి ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. ఆ మేరకు వారు జెవివి కార్యాలయంలో గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఉచిత శిక్షణకు రాదలచిన వారు 97053 33305కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-95 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా ముచ్చటించుకొని, తమ విద్యా జీవితంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పలువురు విద్యార్థులు తమ జీవితాల్లో పాఠశాల ప్రభావాన్ని వివరిస్తూ భావోద్వేగ ప్రసంగాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర 2047 అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వ హించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి శ్రీ రవీంద్ర హైస్కూల్‌కు చెందిన శ్రీనిధి, రెండవ బహుమతి ఎంపీపీ స్కూల్ లక్ష్మీ భవ్య, మూడవ బహుమతి వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన లక్ష్మణ్ అందుకున్నారు. ముఖ్య అతిథిగా వసంతపేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు గురప్ప పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ ముగింపు రోజున బహు మతులు అందజేస్తామని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు
జిల్లా జడ్జి గారి కోర్టులో
M.V.O.P No.300/2024

మునగలచెట్టి రత్న సుష్మా వగైరా ...అర్జీదారులు
-Vs-
మహబూబ్‌బాష మరియు వగైరా ... రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంటుకు నోటీసులు

3.తిప్పలూరు రామిరెడ్డి తండ్రి బ్రహ్మానందరెడ్డి,
కారు ఓనర్ నెం.ఎ.పి.39.సి.సి.7646,
ఇంటి.నెం. 2-2ఎ,బద్రిపల్లి గ్రామం,చాపాడు మండలం,
కడప జిల్లా.

పై నంబరు M.V.O.P లో భూంపోగు జాన్ విక్టర్ 18-11-2022 వతేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయినాడని అతనికి నష్టపరిహారం రూ.1,20,75,000/-లు,ఇందుపైన యం.వి.ఓ.పి కోర్టులో దాఖలు చేసిన రోజు నుండి 12% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదారులు అర్జీదాఖలు చేసినారు. ఇందులో 3వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 26-6-2025 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 26-6-2025

ఎ.మాధన్న
అర్జీదారుల పరం అడ్వకేటు
కర్నూలు.

సింహాద్రిపురం సుందరీకరణ కలేనా..!

అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు - చెత్తకుండీలా వాడుకుంటున్న స్థానికులు

సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రదేశం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం బ్యూటిఫికేషన్ (సుందరీకరణ) పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన సింహాద్రిపురంలో రూ.3.90 కోట్ల ప్రత్యేక నిధులతో నాలుగు వరసల సిమెంట్ రోడ్డు, విద్యుత్ దీపాలు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ ఏర్పాటు పనులు చేపట్టారు. అనంతరం ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇక ఇంతేనా అని స్థానికులు పేర్కొంటున్నారు.

చెత్తకుండీలా వాడుకుంటున్న స్థానికులు

రూ.కోట్ల ప్రజాధనంతో సుందరంగా తీర్చిదిద్దాలనుకుంటున్న బ్యూటిఫికేషన్ నేడు చెత్తకుండీలా మారడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ నుంచి గురజాల రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ వరకు బుటిఫికేషన్ కోసం రూపకల్పన చేశారు. ఇందులో మొక్కలు నాటడానికి సారవంతమైన మట్టిని సైతం అమర్చారు. మొక్కలు నాటకుండా వదిలేయడంతో స్థానికులు దీన్ని చెత్తకుండీలా ఉపయోగిస్తున్నారు. ఇటుకలు, చెత్తాచెదారం వేయడంతో కళావిహీనంగా మారాయి.

నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన బ్యూటిఫికేషన్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి. స్థానికులు చెత్తకుండీలా వాడడం సరైన పద్ధతి కాదు. అధికారులు చర్యలు తీసుకుని త్వరగా పూర్తి చేయాలి.

- రామలింగారెడ్డి, స్థానికుడు, సింహాద్రిపురం

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

సింహాద్రిపురం బ్యూటిఫికేషన్ నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి, చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం0.

-యూసఫ్, ఎఇ, ఆర్అండ్‌బి, సింహాద్రిపురం

చెత్తకుండీలా మారిన సుందరీకరణ

నీతి, నిర్భీతికి నిదర్శనం నీలం సంజీవరెడ్డి

సంజీవరెడ్డికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, నీతి, నిర్భీతికి నిదర్శనమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి కొనియాడారు. నీలం సంజీవ రెడ్డి 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సంజీవరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపాడన్నారు. అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనా దక్షుడుగా పేరు తెచ్చుకొన్నట్లు ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. రైతు బిడ్డ రాష్ట్రపతి కాగలడని, పల్లెటూరి వాసి ఢిల్లీ నేత కాగలడని సంజీవరెడ్డి నిరూపించారని పేర్కొన్నారు. బస్సు రూట్ల విషయంలో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ప్రతికూలంగా వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లో నైతిక విలువలకు పెద్దపీట వేశారన్నారు. శ్రీశైలం డ్యాం, నాగార్జున సాగర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంజీవరెడ్డి మానస పుత్రికలు అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంజీవరెడ్డికి భారత రత్న ప్రదానం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తులసిరెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమారాజా, మదార్, సాయి పాల్గొన్నారు.

మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం

పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడంలో టిడిపి కూటమి, వైసిపి దొందూ దొందేనని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పాఠశాల విద్యలో మూడు రకాల పాఠశాలలు ఉండేవన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉండేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా చేస్తే.. టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాలు చేసిందని విమర్శించారు. అందరినీ అయోమయం, గందరగోళంలో పడివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని చెప్పారు. 66,463 మంది విద్యార్థులు రీకౌంటింగ్‌కు, రీ వాల్యుయేసన్‌కు దరఖాస్తు చేసుకోగా 11,175 మంది మార్కుల్లో తేడా రావడం గమనార్హమన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించిన నారాయణమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

నిబద్ధతతో నారాయణమ్మ విధులు నిర్వర్తించారని చేనేత జౌళి శాఖ ఎడి పిచ్చేశ్వరరావు పేర్కొన్నారు. చేనేత జౌళిశాఖ కడప కార్యాలయంలో అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న పొన్నాల నారాయణమ్మను సన్మానించారు. నగరంలోని ఐఎంఎ హాలులో సన్మానం, ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ కార్యాలయంలో ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మెలిగేవారని తెలిపారు. అప్పగించిన పనులను నిబద్ధతతో పూర్తి చేసేవారని ప్రశంసించారు. వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ విధుల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా నారాయణమ్మ ధైర్యంగా ఎదుర్కొనే వారిని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఆర్‌డి డి పుల్లయ్య మాట్లాడుతూ 2014 వరకు ఆమెతో కలిసి పనిచేశామన్నారు. సన్మాన గ్రహీత నారాయణమ్మ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో అందరితో కలసి, మెలసి పనిచేశానని పేర్కొన్నారు. కార్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేదన్నారు. భర్త రిమ్స్ ఎఎస్ఐ చంద్రాయుడు మాట్లాడుతూ కుటుంబాన్ని, విధులను సమానంగా చూస్తూ రెండిటికి న్యాయం చేసే వారిని ప్రశంసించారు. ఎక్కడ పనిచేసినా మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కుమార్తెలు, అల్లుళ్ల, శ్రేయోభిలాషులు, పోలీస్ శాఖ సిబ్బంది హాజరయ్యారు.

నారాయణమ్మను సన్మానిస్తున్న చేనేత జౌళి శాఖ అధికారి, సిబ్బంది

అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందిన కమతం శ్రీనివాసులు

శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న ఇంజినీర్లు, కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందిన మహోన్నత విజ్ఞానవంతుడు జిల్లా వనరుల శాఖ కడప ముఖ్య ఇంజినీరు (ప్రాజెక్టులు) కమతం శ్రీనివాసులు అని వక్తలు పేర్కొన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కార్యాలయంలో కమతం శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీరు శ్రీవాసులురెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేసేవారని పేర్కొన్నారు. పనితీరు ఉన్నత స్థాయిలో ఉండేదని తెలిపారు. కుటుంబంలో క్రమ శిక్షణను పెంపొందించి పిల్లలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆయన జీవితం పలువురికి ఆదర్శమని కొనియాడారు. ఆర్అండ్‌బి ఎస్ఇ చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితాన్ని ప్రేమించేవాడని తెలిపారు. పారిశ్రామికవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ కమతం శ్రీనివాసులు తన తల్లి ఆశీర్వాదం లేకుండా ఏ పని మొదలు పెట్టరని చెప్పారు. ఆర్ట్స్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ మురళి, ఇంటాక్ చైర్మన్ మానస చిన్నపరెడ్డి తమ అనుబంధాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కమతం శ్రీనివాసులు మాట్లాడుతూ మంచి అధికారులు, స్నేహితులను ఎప్పటికీ మరిచిపోనని తెలిపారు. కడపతో అవినాభావ సంబంధం ఏర్పడిందన్నారు. కడపలో ఎవరితో ఎలాంటి సమస్యలు రాలేదన్నారు. సభలో రిటైర్డ్ ఎస్ఇ ద్వారకనాథరెడ్డి, కర్నూలు ఎస్ఇ బాలచంద్రారెడ్డి, జిఎన్ఎస్ఎస్ ఎస్ఇ ఎసి కొండారెడ్డి, కన్స్ట్రక్షన్ సర్కిల్-3 ఎస్ఇ రవికిరణ్, పిఆర్ ఎస్ఇ జి.శ్రీని వాసులురెడ్డి, టిజిపి ఎస్ఇ డి.వెంకటరామయ్య ప్రసంగించారు. జిఎన్ఎస్ఎస్ గండికోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమ శంకర్, కాంట్రాక్టర్స్, పిఆర్, ఆర్అండ్‌బి ఇంజనీర్స్, చీఫ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది, టీజీపీ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సహోద్యోగులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు, కమతం శ్రీనివాసులు ధర్మపత్ని శాంతి పాల్గొన్నారు.

అణగారిన ప్రజల రచయిత గూగీ వా థియాంగో

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అణగారిన ప్రజల తరపున మాట్లాడిన రచయిత గూగీ వా థియాంగో అని విరసం వరలక్ష్మి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుగివా సంస్మరణ సభ ఆదివారం స్థానిక జెవివి కార్యాలయంలో నిర్వ హించారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి గుప్తా అధ్యక్షత వహించారు. వరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అసమానతలపై గుగ్గి తన రచనల ద్వారా పోరాడారని, మనుషులందరూ సమానమేనని తెలిపిన రచయిత గుగి అని అన్నారు. ఆయన రచనల్లో మాటిగరి చాలా ప్రసిద్ధమైందన్నారు. ప్రశ్న చంపితే చావదని తెలిపిన రచన మాటికరి అని అన్నారు. తవ్వా సురేష్ మాట్లాడుతూ గుగి ఆఫ్రికన్ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారని, ఆయన రాసిన పుస్తకాలలో మాటగరి, బందీ, మట్టి కాళ్ల మహా రాక్షసి, యుద్ధకాలంలో స్వప్నాలు, ఏడవకు బిడ్డ అనేవి తెలుగులోకి అనువాదం అయ్యాయని తెలిపారు. ఈ పుస్తకాలు తెలుగు సమాజాన్ని ప్రభావితం చేశాయన్నారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం పద్మ, జెవివి ఉపాధ్యక్షుడు వేంపల్లి రాజశేఖర్, గురు, సారథి, సోయబ్ అక్షయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వరలక్ష్మి

రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

నూతన పద్ధతులు పాటిస్తే ఉత్తమ దిగుబడులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రస్తుతం వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని పాటిస్తే ఉత్తమ దిగుబడులు సాధించడంతోపాటు మంచి ఆదాయం పొందవచ్చునని శాస్త్రవేత్త బసవరాజు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని నాగసానిపల్లె, అప్పనపల్లె రైతు సేవా కేంద్రాలలో వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మహేష్, ప్రశాంతి, మారుతి, ఎఒ నాగార్జున రైతులకు పంటల సాగులో మెలకువలు, యాంత్రీకరణ, పంటల బీమా, పుట్ట గొడుగుల పెంపకం తదితర సాగు అంశాల గురించి వివరించారు. సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాచమల్లు, నాయకులు

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 4న నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆయన తన స్వగృహంలో ఆదివారం వెన్నుపోటు దినం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. హామీలను తుంగలో తొక్కి ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకి గుర్తు చేస్తూ వైసిపి ఈనెల 4న వెన్నుపోటు దినంగా పాటించాలని పిలుపునిచ్చింది. అందుకు సంబంధించి ఆదివారం పట్టణ పరిధిలోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గం నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. పులివెందుల వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కడప వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు డివి శశికాంత్‌రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, ఆంధ్రప్రదేశ్ మాజీ వేర్ హౌసింగ్ డైరెక్టర్ అంకిరెడ్డి, సురేష్‌రెడ్డి, మస్తాన్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

వేంపల్లె - వేంపల్లె

రైతుబజార్‌ను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కోరారు. స్థానిక రైతుబజార్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన కూరగాయలను విక్రయించుకొనేందుకు గత వైసిపి ప్రభుత్వం పాలనలో రూ.1.20 కోట్లతో రైతుబజార్‌ను నిర్మించారన్నారు. ప్రజలందరూ రైతుబజార్‌లో ఉన్న తాజా కూరగాయలను కొనుగోలు చేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించామన్నారు. రైతు బజారు వినియోగంలోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, వైసిపి నేత కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, దొంతు సుమన్, చంద్ర, వెంకట రమణారెడ్డి, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ అధికారి రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి పులివెందులలో 33 కెవిలైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబకపల్లె, మురారిచింతల సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

మృతి చెందిన భార్యాభర్తలు లక్ష్మీకుమారి, నిత్యానంద్

భార్యను హత్యచేసి.. భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నూరు : చెన్నూరులో దారుణం చోటుచేసుకుంది. భార్యభర్తల మధ్య చిన్నపాటి వివాదాల వల్ల భార్యను భర్త ఉరేసి హత్య చేశారు. అనంతరం తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన చెన్నూరు పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరుకు చెందిన వల్లెపు నిత్యానంద్(37), లక్ష్మీకుమారి(28) భార్యభర్తలు. నిత్యానంద్ జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. 11 రోజుల క్రితం అక్కడి నుంచి స్వస్థలానికి తిరిగి వచ్చారు. అప్పటి నుంచి వారి మధ్య తరచూ చిన్నపాటి గొడవలు జరుగుతున్నారు. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో లక్ష్మీకుమారిని ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఉరేసి హత్య చేశారు. అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు గంగా మేఘన, గంగా మౌనిక ఉన్నారు. సిఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఖాజీపేట: మండల పరిధిలోని పత్తూరు సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ దుర్ఘటనలో గోపవరం మండలం వల్లెల వారిపల్లెకు చెందిన దుగ్గిపోయిన భాస్కర్ (34) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. ఖాజీపేట పోలీసులు సంఘటన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెకు చెందిన పఠాన్ వాహిద (50)అనే మహిళ అదృశ్యమైందని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ నర్సింహులు కోరారు. వేంపల్లెలోని ఉర్దూ షాదీఖానా సమీపంలో నివాసం ఉంటున్న పఠాన్ వాహిదా మే 30న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుండి వెళ్లి పోయినట్లు చెప్పారు. ఎవరికైనా మహిళా ఆచూకీ తెలిస్తే వేంపల్లె పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.